తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 30 - 04 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 4

## నిరుపేద యువకుని ఆపరేషన్‌కు..

# మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ చేయూత

### రూ. 53 వేల చెక్కు అందజేత



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన సీపీఐ నాయకులు, ఆంధ్రభూమి మాజీ రిపోర్టర్ దివంగత కంచి నర్సయ్య కుమారుడు శ్రీనాథ్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేయాల్సి రావడంతో తల్లిదండ్రులు లేని నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనాథ్ బంధువులు మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు ద్వారా సాయం కోరారు. దీంతో స్పందించిన దాతలు, వాట్సాప్ గ్రూపు సభ్యులు అందించిన రూ.53 వేల సాయాన్ని బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న చేతుల మీదుగా అందజేశారు. ఆపదలో ఉన్న శ్రీనాథ్ వైద్యం కోసం సాయం చేసిన మన మోత్కూరు వాట్సాప్ గ్రూపుకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ వెంకన్న మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా ఆపదలో ఉన్నవారు మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సాయం కోరిన వెంటనే దాతలు స్పందించి చేయూతనివ్వడం ఎంతో గొప్ప విషయమని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, మాజీ ఎంపీటీసీ ముద్దం జయశ్రీ, వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, ఎడ్ల శ్రీనివాస్, మొగుల్లపల్లి సోమయ్య, గాదెనబోయిన నాగరాజు, మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్, కుర్మిళ్ల రాములు, గుంటి దేవా, ఇక్కిరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లి లలిత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ప్రజావారధి/మోత్కూరు

తెలంగాణ గాన కోకిల, మలిదశ ఉద్యమ నాయకురాలు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బెల్లి లలిత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కోరారు. బెల్లి లలిత 52వ జయంతి సందర్భంగా బుధవారం మోత్కూరులో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లలిత కళారూపంలో ప్రజలను చైతన్యం చేసిందన్నారు. 1996లో భువనగిరి కేంద్రంగా దగా పడ్డ తెలంగాణ బహిరంగ సభ పెట్టి ఢిల్లీ వరకు తెలంగాణ ఆకాంక్షను వినిపించిన బహుజన బిడ్డ బెల్లి లలిత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, లాదినేని సోమేశ్వర్, బాబురావు, గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శాలిగౌరారం నూతన తహసీల్దార్‌గా మాధవరావు

ప్రజావారధి/శాలిగౌరారం



శాలిగౌరారం నూతన తహసీల్దార్‌గా కేతావత్ మాధవరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డీటీ బిట్ల వరప్రసాద్ పనిచేశారు. జీహెచ్‌ఎంసీలో ఎన్నికల విభాగంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన ప్రమోషన్‌పై శాలిగౌరారం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తానని, భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డీటీ బిట్ల వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ భోగరాజు ప్రవీణ్ కుమార్, ఆర్ఐలు మహ్మద్ అబ్దుల్ రఫీద్, కంబాలపల్లి నాగయ్య, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### రైతులకు ఇబ్బందుల్లేకుండా

# ధాన్యం కొనుగోలు చేయాలి



ప్రజావారధి/శాలిగౌరారం

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని శాలిగౌరారం ఇన్‌చార్జి తహసీల్దార్ బిట్ల వరప్రసాద్ కోరారు. శాలిగౌరారం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగో లు, రవాణా, లారీల అన్ లోడింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా ధాన్యం కొనాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో లారీల ద్వారా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఏపీఎం శంకరయ్య, ఎస్‌పిఆర్‌పి మార్కెటింగ్ దాసరి శాంత, శాలిగౌరారం సింగిల్‌విండో సీఈవో నిమ్మల ఆంజనేయులు, సీసీ కొండ మట్టయ్య, లారీ అసోసియేషన్ సభ్యులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామగ్రామాన మేడేను ఘనంగా నిర్వహించాలి



- హక్కుల రక్షణకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉద్యమించాలి
- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పాలకవర్గాలకు కనివిప్పు కలిగించేలా కార్మికులు, కర్షకులు ఐక్యంగా గ్రామగ్రామాన మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. బుధవారం మోత్కూర్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికాగో నగరంలో 140 ఏళ్ల క్రితం కార్మికుల హక్కుల కోసం జరిగిన నిరసన ర్యాలీపై ప్రభుత్వం జరిపిన దమనకాండ ఫలితంగా ప్రాణాలు కోల్పోయిన కార్మికుల రక్తం నుండి ఎర్రజెండా పుట్టిందని, ఆ ఎర్రజెండా నీడలోనే కార్మికులకు హక్కులు సాధించబడ్డాయని తెలిపారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న హక్కులను నేడు దేశాన్ని పాలిస్తున్న పాలకులు కాలరాస్తున్నారని, ఆ విధానాలకు వ్యతిరేకంగా హక్కుల రక్షణ కోసం కార్మికులు, కర్షకులు సమస్త ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. దేశంలో పెట్టుబడిదారులే రాజకీయ నాయకులుగా చలామణి అవుతూ ప్రభుత్వాలను శాసిస్తున్నారని, పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా శాసనాలు చేయబడుతున్నాయని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు, ప్రజలు పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన

# మోత్కూరు అక్షర హైస్కూల్



- 579 మార్కులతో మండల టాపర్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని రాధ



అర్చన



సాయిసూరజ్

- వందశాతం ఫలితాలు సాధించడం పట్ల విద్యార్థులను అభినందించిన స్కూల్ డైరెక్టర్లు రాజిరెడ్డి, శివాని

ప్రజావారధి/మోత్కూరు

పదవ తరగతి ఫలితాల్లో మోత్కూరు అక్షర హైస్కూల్ మండల టాపర్‌గా నిలిచింది. పాఠశాల విద్యార్థిని కె.రాధ 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించడంతో పాటు జిల్లాలోనే తమ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి రికార్డు సృష్టించారని స్కూల్ డైరెక్టర్లు ఎం.రాజిరెడ్డి, ఎం.శివాని తెలిపారు. విద్యార్థులు డిఇ.అర్చన 575 మార్కులు, కె.సాయి సూరజ్ 572, ఎస్.సాత్విక 560, డి.సాయినాథ్ 556, బి.సిరి 552, ఎస్.సృజన 552 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు 41 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 41 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి వందశాతం ఫలితాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 579 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని రాధను అభినందించారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మండలంతో పాటు జిల్లాలోనే పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేస్తున్నామని, తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతామన్నారు. పది ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు.